సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నేడు జీవీఎంసీలో 'పీజీఆర్ఎస్'

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్టు నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



బాలుడు వితేశ్‌ను తండ్రికి అప్పగిస్తున్న ఎస్ఐ సంతోష్

బీచ్‌రోడ్డు: పిక్నిక్ కోసం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి తప్పిపోయిన బాలుడిని వెతికి తల్లిదండ్రులకు పోలీసులు అప్పగించారు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. జొన్నాడ గ్రామం నుంచి ఓ కుటుంబం మొత్తం ఆదివారం ఆర్కే బీచ్‌కు పిక్నిక్ కోసం వచ్చింది. అందరూ సముద్రం వద్ద సందడి చేస్తున్న సమయంలో ఆరేళ్ల బాలుడు వితేశ్ వారి నుంచి తప్పిపోయాడు. ఈ విషయాన్ని టూరిజం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. వారు పోలీసు గ్రూప్‌లో సమాచారమిచ్చారు. పోలీసులు తీరం మొత్తం జల్లెడ పట్టి బాలుడిని గుర్తించారు. ఎస్ఐ సంతోష్ వితేశ్‌ను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా సంతోష్ బృందాన్ని సీఐ రమణయ్య అభినందించారు.

45 ద్విచక్ర వాహనాలు సీజ్



సీజ్ చేసిన ద్విచక్ర వాహనాల వద్ద త్రీ టౌన్ ఎస్ఐలు సంతోష్, సురేష్

బీచ్‌రోడ్డు: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఏసీపీ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో ఆదివారం ఈస్ట్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 45 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. రేస్ బైక్‌లు, అధిక ధ్వని వచ్చే బైక్‌లు, నంబరు ప్లేట్ లేని బైకులు, స్కూటీలను సీజ్ చేసి మోటర్ వెహికల్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశారు. అధిక ధ్వని ఇచ్చే సైలెన్సర్లను బైక్‌ల నుంచి తొలగించారు. వాహన తనిఖీల్లో మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు సంతోష్, సురేష్ తదితరలు పాల్గొన్నారు.

భౌగోళిక విజ్ఞానం అవసరం

మధురవాడ: భౌగోళిక విజ్ఞానం ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమని, ముఖ్యంగా ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాల్సి అవసరం ఉందని గురుకుల డీసీవో రూపావతి చెప్పారు. మధురవాడ సమీపంలోని కొమ్మాది రిక్షా కాలనీలోని ఆంధ్ర ప్రదేశ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల సీవోఈలో ఆదివారం భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్) దినోత్సవాన్ని పురస్కరించుకుని సెమినార్ నిర్వహించారు. విశాఖ చాప్టర్ ఐజీఎస్ చైర్మన్ ప్రొఫెసర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ భౌగోళిక విశ్లేషణ, శాస్త్రీయ విచారణ, కొత్త అధ్యయనాల ద్వారా చరిత్ర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డి.శాంతకుమారి, ఐజీఎస్ సభ్యురాలు ప్రొఫెసర్ బి. హేమమాలిని, సెక్రటరీ వజీర్ మహమ్మద్, రిటైర్డ్ సీనియర్ సైంటిస్ట్ బి.మంగళమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

దారి లేక అవస్థలు

- నేరెళ్లకోనేరులో వర్క్‌షాప్‌గా మారిన ప్రధాన రహదారి
- రోడ్డుకు ఇరువైపులా ఆటోల నిలిపివేత
- ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లకు సమస్య చెప్పినా ప్రయోజనం శూన్యం
- స్థానికులు, వాహన చోదకుల ఆవేదన



సీపీఐ కార్యాలయం - నేరెళ్లకోనేరు రోడ్డులో ఇరువైపులా నిలిపిన ఆటోలతో ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు, పాదచారులు

అల్లిపురం: ఎన్ని రహదారులున్నా.. గమ్యానికి చేర్చే దారి ఒక్కటే. ఉన్న ఆ ఒక్క మార్గాన్ని మూసేస్తే..? నానా అవస్థలు.. నరకయాతన పడుతూ ముందుకు సాగాల్సిందే. నేరెళ్లకోనేరు ప్రాంతంలో ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడ ప్రధాన రహదారిని వర్క్‌షాపుగా మార్చేశారు. రోడ్డుపైనే ఆటో టింకరింగ్ పనులు చేపడుతుండటంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సీపీఐ కార్యాలయం నుంచి హరితా లాడ్జి వరకు, నేరెళ్లకోనేరు జంక్షన్ నుంచి రాచపోలమాంబ దేవాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా ఆటోలు నిలపడం, టింకరింగ్, పెయింటింగ్ పనులు చేయడంతో స్థానికులు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాదచారులు నడిచేందుకు దారి లేక అల్లిపురం, నేరెళ్లకోనేరు కాలనీ వాసులు, జీవీఎంసీ మరుగుదొడ్ల వద్దే పనులు చేపట్టడంతో స్థానిక మహిళలు ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్లిపురం వాసులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. మాకు దారి కల్పించండి బాబూ అంటూ పలుమార్లు అధికారుల వద్ద మొరపెట్టుకున్నారు.

కార్పొరేటర్‌కు మొరపెట్టుకున్నా..

జీవీఎంసీ ఎన్నికల్లో నేరెళ్లకోనేరు సమస్య పరిష్కరిస్తానని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు హామీ ఇచ్చారు. గెలిచాక ఆ విషయాన్ని గాలికొదిలేశారని స్థానికులు మండిపడుతున్నారు. ముఖ్యంగా మహిళల మరుగుదొడ్ల వద్ద ఆటోల రిపేర్లు చేయడంతో వాటిని వినియోగించుకోలేక పోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే వారిని అక్కడ నుంచి తరలించాలని స్థానికులు కార్పొరేటర్‌కు లిఖిత పూర్వకంగా తెలియజేసినా, ఎన్నికల్లో హామీని నెరవేర్చాలని కోరినా.. పట్టించుకోలేదని నేరెళ్లకోనేరు ప్రతినిధి రమేష్ తోపాటు స్థానిక మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల వార్డులో పర్యటించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు పరిస్థితి వివరించామని, ఇంత వరకు చర్యలు లేవని స్థానికులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



వార్డు పర్యటనలో ఎమ్మెల్యే వంశీకృష్ణకు సమస్య తెలియజేస్తున్న నేరెళ్లకోనేరు వాసులు(ఫైల్)

ఎన్నిసార్లు చెప్పినా.. షరామామూలే!

గతంలో జీవీఎంసీ కమిషనర్‌గా పనిచేసిన రామాంజనేయులు ఈ ప్రాంతంలో రహదారికి అడ్డంగా పనులు చేస్తున్నారని, పాదచారులకు, వాహన చోదకులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని షాపులకు తాళాలు వేయించారు. అప్పటి దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ పుణ్యమా అని వ్యాపారులు పది రోజుల పాటు సీజ్‌చేసిన షాపులను తెరిపించుకున్నారు. నేడు పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. ట్రాఫిక్ పోలీసులు పదే పదే చెబుతున్నా.. వ్యాపారులు షరామామూలుగానే తమ పని తాము చేసుకుపోతున్నారు. ఎవరైనా అడిగితే ఎవరేం చేస్తారు.. ఎవరికి ఇవ్వాల్సిన మామూళ్లు వారికిస్తున్నాం అంటూ దబాయిస్తున్నారని స్థానికులు, పాదచారులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటో, టింకరింగ్, సీట్ వర్క్‌లు చేసే వారు రోడ్డు మొత్తాన్ని ఆక్రమించుకున్నారు. నడిచేందుకు దారి లేక పోవడంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు.

నడిచే దారి లేదు



నేరెళ్లకోనేరులో రోడ్డుకు ఇరువైపులా ఆటోలు నిలిపి ఉంచడంతో రోడ్డుపై కనీసం నడిచేందుకు దారి ఉండటం లేదు. ఎక్కడికైనా వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుంది. అడిగితే గొడవలు పడుతున్నారు.

– పట్నాల రమణమ్మ, నేరెళ్లకోనేరు

మరుగుదొడ్లకు వెళ్లలేక పోతున్నాం



నేరెళ్లకోనేరు నుంచి హరిత లాడ్జికి వెళ్లే దారిలో మరుగుదొడ్లు ఉన్నాయి. కాలనీలో చాలా మందికి మరుగుదొడ్లు లేవు. వారంతా వాటినే వినియోగిస్తుంటారు. మరుగుదొడ్ల చుట్టూ పనులు చేస్తుంటారు. అక్కడికి వెళ్లాలంటేనే భయంగా ఉంటోంది.

–సుగంధి జయమ్మ, నేరెళ్లకోనేరు

ఒంటరిగా వెళ్లాలంటే భయం



మా వీధిలో ఇంట్లో ఆడపిల్లలను ఒంటరిగా పంపాలంటే భయమేస్తుంది. ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి ఆటోలు రిపేర్లు చేయించుకునేందుకు వస్తుంటారు. ఒక్కొక్కరు ఒక్కోలా ఉంటారు. చీకటి పడితే అక్కడే ఆటోల్లో మద్యం తాగుతుంటారు. పెద్దవాళ్లయినా ఒక్కరూ వెళ్లాలంటే భయంగా ఉంటుంది.

– లక్ష్మి, స్థానికురాలు

కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇచ్చాం



గత జీవీఎంసీ ఎన్నికల్లో నేరెళ్లకోనేరు రోడ్డులో ఆటో పనులు తొలగిస్తామని కార్పొరేటర్ కందుల నాగరాజు హామీ ఇచ్చారు. అది నిలబెట్టుకోమని పలుమార్లు వినతిపత్రం ఇచ్చాం. ఇటీవల వార్డు పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే వంశీకృష్ణకు చెప్పాం. ఇంత వరకు ఎవరూ పట్టించుకోలేదు. మా గోడు విని తక్షణం వాటిని తొలగించాలి.

–ఎస్.జానకి, స్థానికురాలు

కళలకు ప్రాధాన్యం



కళాకారులకు బహుమతులు అందించి సత్కరిస్తున్న రాజశేఖర్

డాబాగార్డెన్స్: ప్రతి ఒక్కరూ కళలకు ప్రాధాన్యమివ్వాలని ఆధ్యాత్మిక వేత్త రాజశేఖర్ అన్నారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మిరాకిల్ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ ఆధ్వర్యంలో ఆదివారం వైజాగ్ లిటిల్ చాంపియన్ టాలెంట్ పేరుతో చిన్నారులకు వివిధ రకాల సాంస్కృతిక కళలపై పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథి రాజశేఖర్ కళాకారులను అభినందించి, విజేతలకు బహుమతులు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి కళలపై ఆశక్తి చూపాలని సూచించారు. చిన్నారులకు ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల ప్రోత్సాహం అందించినట్లు అవుతుందన్నారు. కార్యక్రమంలో మహ్మద్ తాజ్, కె.వి.ఎస్.మూర్తి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలరించిన వినోదవల్లరి

సీతంపేట: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం క్రియేటివ్ కామెడీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన వినోద వల్లరి కామెడీ స్కిట్లు ఆద్యంతం నవ్వులు పంచాయి. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసీ మెడిసన్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.ఎ.నాయక్‌ను సత్కరించారు. చిన్నారులు మేడా అన్విత, అభిరామ్ పాడిన అన్నమయ్య కీర్తనలు అలరించాయి. అనంతరం తాతాభక్తుల లక్ష్మీప్రసాద్ పాడిన పేరడీ గీతాలు, వింజమాల రామకుమార్ పాడిన హిందీ గీతాలు ఆహూతులను హుషారెత్తించాయి. ఎ.కె. దుర్గాప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

రేపటి నుంచి విశాఖ బాలోత్సవం



సమావేశమైన బాలోత్సవం వలంటీర్లు, నిర్వాహక కమిటీ సభ్యులు

డాబాగార్డెన్స్: ఈ నెల 19, 20, 21 తేదీల్లో సెయింట్ ఆంథోనీ ప్రైమరీ స్కూల్ వేదికగా నిర్వహించనున్న విశాఖ బాలోత్సవానికి సంబంధించి ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో వలంటీర్లు సమావేశమయ్యారు. బాలోత్సవం నిర్వహణపై కార్యాచరణ రూపొందించారు. ఈ సందర్భంగా విశాఖ బాలోత్సవం ఆర్గనైజింగ్ కమిటీ ప్రతినిధి కె.రమాప్రభ మాట్లాడుతూ బాలోత్సవానికి సంబంధించి ఇప్పటికే పాఠశాలల నుంచి ఎంట్రీ ఫారాలు అందజేశారన్నారు. ఒకే రోజు 26 ఈవెంట్స్, వేలాది మంది విద్యార్థులు పలు పోటీల్లో పాల్గొంటున్నట్టు తెలిపారు. కార్యక్రమం నిర్వహణలో వలంటీర్లు కీలకపాత్ర పోషించనున్నారని, జరిగిన ప్రతి ఈవెంట్‌కు ప్రత్యేకంగా జడ్జిలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వలంటీర్లతోపాటు వివిధ కళాశాలలో చదువుతున్న 120 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా పనిచేసేందుకు ముందుకొచ్చారని పేర్కొన్నారు. వలంటీర్ల కో ఆర్డినేటర్‌గా ఎం.గుణశంకర్, కమిటీ సభ్యులుగా శశికుమార్, సాయితేజ, సాయికుమార్, అజయ్‌లను నియమించారు. బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని కో ఆర్డినేటర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాలోత్సవం నిర్వహక కమిటీ సెక్రటరీ జి.ఎస్.రాజేశ్వరరావు, అధ్యక్షుడు రఘు పిల్లలమర్రి, కె.రమాప్రభ, ఎల్లాజీ, దండు నాగేశ్వరరావు, కృష్ణారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు



చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న చిన్నారులు

డాబాగార్డెన్స్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పూర్ణా మార్కెట్ దరి రంగిరీజు వీధిలోని బాలల శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, చదరంగం పోటీలు, వుయ్ లవ్ రీడింగ్ కార్యక్రమం నిర్వహించారు. అడ్వకేట్ డి.అజయ్‌కుమార్ పోటీలను ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి టి.పోలితల్లి తదితరులు పాల్గొన్నారు.



అల్లిపురం శాఖ గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అల్లిపురం శాఖ గ్రంథాలయంలో..

అల్లిపురం: అల్లిపురం శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని చూడచక్కని చిత్రాలు గీచారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పి.వి.నూకరాజు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు దేశభక్తి గేయాల పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20న ముగింపు సందర్భంగా విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.



మహిళా కళాశాల విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న డాక్టర్ ధారిణి

ప్రభుత్వ మహిళా కళాశాలలో..

విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల లైబ్రరీ హాల్‌లో విద్యార్థినులకు ఆచార్య డాక్టర్ ఎ.ధారిణి వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల చేతుల మీదుగా బహుమతులు అందిస్తామని తెలిపారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

2 నుంచి మార్గశిర మాసోత్సవాలు

డాబాగార్డెన్స్: మార్గశిర మాసోత్సవాలు డిసెంబర్ 2 నుంచి 30 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. మార్గశిర మాసోత్సవాల్లో నిర్వహించే ప్రత్యేక పూజల వివరాలను ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు తెలిపారు. మార్గశిర ప్రతి గురువారం నిర్వహించే పంచామృతాభిషేకంలో పాల్గొన దలచే భక్తులు రూ.7,500, మార్గశిరంలో గురువారం మినహా మిగిలిన రోజుల్లో నిర్వహించే పంచామృతాభిషేకంలో పాల్గొన దలచే భక్తులు రూ.2,500 పూజా రుసుం చెల్లించాలి. అలాగే ప్రతి శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేకంలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించాలి. ఆయా పూజల్లో పాల్గొనదలచే భక్తులు పూజా రుసుం ముందుగా చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్ ద్వారా టీటీటీ.్చp్ఞఠిuఝ్చn్చజ్చ.జీn వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవాలి. లేదా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, విశాఖపట్నం అకౌంట్ నంబరు 0608 1001 1006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్080608లో పూజా రుసుం చెల్లించి, ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన వారు ట్రాన్సాక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్ర నామాలు, పూర్తి చిరునామాను endow-eokanaka@gov.in ద్వారా పంపవచ్చు. ఆలయంలో కూడా టికెట్లు పొందవచ్చన్నారు.



కనకమహాలక్ష్మి

అయ్యప్ప స్వామికి పూజలు



స్వాములకు భిక్ష వడ్డిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అల్లిపురం: జీవీఎంసీ 29వ వార్డు నాయకుడు మన్యాల శ్రీనివాస్ స్వామి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అయ్యప్ప పూజల్లో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమంలో మాలధారులకు ఎమ్మెల్యే అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం గురుస్వామిని సత్కరించారు.

21న రక్తదాన శిబిరం

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 21న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఎన్‌సీసీ అధికారి బి.సన్యాసినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

రహదారుల్లో గోతులు.. నిత్యం ప్రమాదాలు



టౌన్ కొత్త రోడ్డులో ప్రమాదరకంగా గొయ్యి



రామకృష్ణా మార్కెట్ వద్ద గొయ్యి

డాబాగార్డెన్స్: కూటమి ప్రభుత్వం వచ్చి దాదాపు ఐదు నెలలు గడుస్తున్నా.. చిన్నపాటి సమస్యలను పరిష్కరించడంలో కూడా విఫలమవుతోంది. ప్రధాన రహదారుల్లో ఏర్పడిన గోతులను సరిచేయకుండా వదిలేయడంతో అవి వాహన చోదకుల పాలిట శాపంగా మారాయి. పలువురు రోడ్డు ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలయ్యారు. టౌన్ కొత్తరోడ్డు వద్ద 15 రోజులుగా చిన్నపాటి గొయ్యి ఉండేది. కాలక్రమేణా అది భారీ గోతిలా తయారైంది. ఈ మార్గంలో రాత్రి వేళల్లో వాహన చోదకులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న దృష్ట్యా స్థానికులు ఓ ఎర్ర క్లాత్‌ను కర్రకు పెట్టి పాతారు.

- రామకృష్ణా రైతు మార్కెట్ వద్ద కల్వర్టుపై ఉన్న పలక విరిగింది. పలువురు ద్విచక్ర వాహన చోదకులు ఈ గొయ్యిలో పడి ప్రమాదాలకు గురయ్యారు. రాత్రి వేళల్లో ఈ ఇది కనిపించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలకు నిలయంగా మారిన ఆ గోతులను తక్షణం పూడ్చాలని కోరుతున్నారు.

ఘనంగా రక్షణగిరి యాత్ర



దివ్యబలిపూజ నిర్వహిస్తున్న బిషప్ జయరావు



తేరును మోస్తున్న క్రైస్తవులు

కంచరపాలెం: విశాఖ కథోలిక అగ్రపీఠం, జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ రక్షణగిరి విచారణకర్తలు రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాశ్ సంయుక్త నేతృత్వంలో క్రీస్తు రక్షకుని యాత్ర, రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి స్వస్థత ప్రార్థనలు, ఫాదర్ ఇంగ్లిష్‌లో దివ్యబలి పూజలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన వేడుకల్లో రెవరెండ్ ఫాదర్ పాలిమేర జయరావు బైబిల్ సందేశం అందించారు. ప్రపంచానికి ఏసు క్రీస్తు రక్షణ ప్రణాళికలను వివరించారు. సుమారు 50 మంది ఫాదర్లు, 100 మంది మతకన్యలతో కలసి రక్షణగిరి పర్వదిన దివ్య పూజాబలిని సమర్పించారు. సెయింట్ పీటర్స్ హైస్కూల్ ముఖద్వారం వద్ద 'బాలయేసు మండపం–పునీత క్లారమ్మ స్వరూపం'తేరులను ఆర్చిబిషప్ జయరావు ప్రారంభించారు. సహాయ విచారణకర్తలు ఫాదర్ వినయ్‌కుమార్, ఫాదర్ ఆంథోనిరాజ్, పీపీసీ సభ్యులు రాజేష్‌బాబు, రవీంద్ర, శేషుబాబు, ఆలిండియా క్యాథలిక్ యూనియన్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



రక్షణగిరి ఉత్సవాల్లో పాల్గొన్న ఉత్తరాంధ్ర క్రైస్తవులు

బరితెగించిన మందుబాబులు

- వైన్ షాపుల వద్దే మద్యం సేవిస్తున్న వైనం
- ఎమ్మెల్యే అనుచరుల షాపులు కావడంతో అటువైపు చూడని పోలీసులు

మల్కాపురం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతుండటంతో మందుబాబులకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. వైన్ షాపుల వద్ద, షాపులకు పక్కన ఉన్న ఫుట్‌పాత్‌లపై మద్యం సేవిస్తూ వీరంగం సృష్టిస్తున్నారు. వైన్‌షాపులు టీడీపీ నేతలవి కావడంతో అటువైపు పోలీసులు కన్నెత్తి చూడటం లేదు. జీవీఎంసీ 61వ వార్డు ప్రధాన సేవా మార్గంలోని మరిడిమాంబ కల్యాణ మండపానికి అతి సమీపంలో ఇటీవల ఓ వైన్ షాపును పశ్చిమ ఎమ్మెల్యే అనుచరులైన టీడీపీ నేతలు ఏర్పాటు చేశారు. కౌంటర్ సేల్స్ పెంచేందుకు మందుబాబులు షాపు వద్దే మద్యం సేవించినా నోరు మెదపడం లేదు. నిజానికి వైన్ షాపు వద్ద మద్యం మాత్రమే కొనుగోలు చేయాలి. బార్‌లో లేదా ఇంటి వద్ద మద్యం సేవించాలి. అందుకు విరుద్ధంగా వైన్‌షాపుల వద్దే కొంత మంది మందుబాబులు మ ద్యం సేవిస్తున్నారు. ఫుట్‌పాత్‌లను బార్‌లుగా మార్చుకుంటున్నారు. ప్రధాన సేవా మార్గంలోని నాలుగు వైన్ షాపుల వద్దే ఇదే పరిస్థితి నెలకొంది. ఈ వైన్ షాపులకు 200 మీటర్ల దూరంలో మల్కాపురం పోలీస్‌స్టేషన్ ఉంది. ప్రతి రోజూ సాయంత్రం సమయంలో పోలీసుల గస్తీ నిర్వహిస్తున్నప్పటికీ.. వైన్‌షాపుల వద్ద జరుగుతున్న ఈ తంతుపై కన్నెత్తి చూడటం లేదు. మందుబాబుల చేష్టలతో పాదచారులు భయాందోళన చెందుతున్నారు.



వైన్‌షాపు ముందే దర్జాగా మద్యం సేవిస్తున్న మందుబాబు



వైన్‌షాప్ వద్ద ఫుట్‌పాత్‌ను బార్‌గా మార్చుకున్న మందుబాబులు

ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులు

సీతంపేట: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన అవార్డు గ్రహీతలను బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం ఘనంగా సత్కరించారు. సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎస్.ఎన్.రాజు, ఆచార్య వి.బాలమోహన్‌దాస్, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ కలిసి ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. సత్కారం పొందిన వారిలో కె.వి.డి.నరసింహరావు, పి.రాజారావు, పి.నాగేశ్వరరావు, కె.గంగాధరరావు, ఎస్.రాజేంద్రప్రసాద్, కె.నాగూర్ ఉన్నారు. ఈ సందర్భంగా ఆచార్య జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ అవార్డులు కృషికి, క్రమశిక్షణకు, నిజాయతీకి, అంకితభావానికి గుర్తింపుగా నిలుస్తాయన్నారు. విద్యార్థులందరినీ సమ దృష్టితో చూడాలన్నారు. బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు కేవలం పుస్తకంలోని పాఠాలే కాకుండా జనరల్ నాలెడ్జి కూడా బోధించాలని సూచించారు. కార్యక్రమానికి బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు అధ్యక్షత వహించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010810033, 7075989701
Office mail : sakshiadvtvsp@gmail.com